# జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్
- చించినాడలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం


చించినాడలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

**యలమంచిలి:** 'జగనన్న ప్రతినిధులుగా మేమంతా మీ ముందుకు వచ్చాం.. ప్రభుత్వ పథకాలన్నీ మీకు అందుతున్నాయా.. సమస్యలేమైనా ఉన్నాయా.. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మీరంతా మీ చల్లని ఆశీస్సులు మరోసారి జగనన్నకు అందించాలంటూ జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చించినాడలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ప్రభుత్వం జగనన్నదన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును ప్రజలంతా గుర్తించాలని కోరారు. ఈ ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదిస్తే మీ బిడ్డల భవిష్యత్తును చక్కదిద్దే బాధ్యత జగనన్న తీసుకుంటారని శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న వివిధ అభివృద్ధి పనులకు కవురు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు ఏ విధంగా పాఠాలు చెబుతున్నారు, జగనన్న గోరుముద్ద అమలు తీరు ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, ఉప సర్పంచ్ రుద్రరాజు బలరామకృష్ణంరాజు (చిన్న) పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదునూరి లక్ష్మీపతిరాజు, నాయకులు విప్పర్తి నవీన్, ముదునూరి రంగరాజు, కఠారి నారాయణస్వామి, బండారు అరుణాదేవి, రేవూరి శ్రీనివాస్, వల్లభు సాయి వెంకట నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు, వినుకొండ రవి, గుర్రాల వెంకట్రావు, ఉచ్చుల స్టాలిన్, కర్రా జయ సరిత తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 10న నరసాపురం మండల పరిషత్ సమావేశం

**నరసాపురం రూరల్:** నరసాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ మైలాబత్తుల సోనీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ సోమవారం చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

### ఊపందుకున్న ఉపాధి హామీ పనులు


కాళీపట్నం తూర్పులో కాలువలో మట్టి తొలగింపు పనులు చేస్తున్న కూలీలు

**మొగల్తూరు:** మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల్లో పంట బోదెలతో పాటు డిస్ట్రిబ్యూటరీ చానల్స్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు. సోమవారం సుమారు 450 మందికి పనులు కల్పించామని, అంతేకాక ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే పనులు కూడా చేపడుతున్నామని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు.

### కరాటే పోటీల్లో నరసాపురం విద్యార్థుల ప్రతిభ


బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు

**నరసాపురం:** పాలకొల్లులో జపాన్ హయాషియా షిటోర్యూకాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే కటా పోటీల్లో నరసాపురం విద్యార్థులు ప్రతిభ చూపారు. కరాటే మాస్టర్ జోస్యుల ప్రతాప్ శిష్యులు తేజస్‌గాంధీ, భానుచరణ్, విష్ణు, ప్రవీణ్‌కృష్ణస్వామి, వి.పూర్ణశ్రీ, పి.కృష్ణకిషోర్, పీజే వెంకట్, ఎ.సతీష్, కె.అమృత బ్లాక్ బెల్ట్‌లు సాధించారు. విద్యార్థులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అభినందించారు.

### మేడిది జాన్సన్ నియామకంపై హర్షం


మేడిది జాన్సన్‌ను అభినందిస్తున్న దృశ్యం

**పాలకొల్లు అర్బన్:** క్రిస్టియన్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ హామీ ఇచ్చారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో దైవసేవకుడు సామ్యూల్ పాలమూరి ఆరాధన సంఘంలో సోమవారం పలువురు క్రిస్టియన్ సంఘ పెద్దలు జాన్సన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాస్టర్లకు గౌరవ వేతనం సాధ్యమైనంత ఎక్కువ మందికి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గౌరవ వేతనం పొందడానికి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు గుత్తుల సాల్మన్ దొర, కె.జాన్ వెస్లీ, రాజారత్నం, చక్రవర్తి, విక్టర్‌బాబు, శామ్యేలు తదితరులు జాన్సన్‌ని అభినందించారు.

## డ్రోన్ ద్వారా పిచికారీతో ఆదా


డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ జయదుర్గామాధురి

**పెనుమంట్ర:** డ్రోన్ ద్వారా పురుగుమందులు, ద్రవరూపంలోని ఎరువులను పిచికారీ చేయవచ్చని పెనుమంట్ర మండల వ్యవసాయశాఖాధికారి ఎం.జయదుర్గామాధురి చెప్పారు. సోమవారం పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలోని సత్తి లోకేష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయదుర్గామాధురి మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పురుగుమందులు పిచికారీ చేయడం ద్వారా ఎకరానికి రూ.250 నుంచి రూ.300 వరకు ఖర్చు అవుతుందని, 10 నుంచి 15 నిమిషాలలో పిచికారీ పూర్తవుతుందని తెలిపారు. ఏఆర్ఎస్ మార్టేరు టెక్నికల్ సిబ్బంది బి.హేమలత మాట్లాడుతూ డ్రోన్ ద్వారా రోజుకి 20 ఎకరాల వరకు పిచికారీ చేసుకోవచ్చన్నారు. అంతేకాక పురుగుమందుల మోతాదు 25 శాతం వరకు తగ్గుతుందని తెలిపారు. సీహెచ్‌సీ గ్రూపులకు వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై డ్రోన్‌లను అందిస్తామని, కావాల్సిన వారు మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

**యలమంచిలి:** నరసాపురం కోర్టుల్లో ఈ నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. యలమంచిలిలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ పడి తీర్పు వస్తే అది సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. సాధారణంగా మేజిస్ట్రేట్ కోర్టులో నిందితుడికి శిక్ష పడితే జిల్లా కోర్టుకు, హైకోర్టుకు, సుప్రీం కోర్టుకు వెళ్లి అప్పీలు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పు సివిల్ డిక్రీ కిందకు వస్తుందన్నారు. అంటే అదే తుది తీర్పు అన్నారు. సుప్రీంకోర్టులో తుది తీర్పు లాంటి అవకాశం లోక్ అదాలత్‌లో ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడిన కేసులు సివిల్ డిక్రీతో సమానమన్నారు. కోర్టు కేసులతో విసిగిపోయిన కక్షిదారులు రాజీకి అర్హత ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ బడేమియా, యలమంచిలి తహసీల్దార్ లక్కు నరసింహారావు, ఎస్సై జాజుల విజయ్‌నాగప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు గృహసారథులకు అవగాహన సదస్సు

**పెనుగొండ:** ఆచంట మండలంలో నూతనంగా నియమితులైన గృహసారథులకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఆచంటలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు రామేశ్వరస్వామి మండపంలో మొదటి బ్యాచ్‌కు, 2.30 గంటలకు రెండవ బ్యాచ్‌కు అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సులకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## నేడు చించినాడలో గడపగడపకు మన ప్రభుత్వం

**యలమంచిలి:** మండలంలోని చించినాడ గ్రామంలో వరుసగా రెండో రోజు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని బుచ్చిరాజు కోరారు.

## పక్కా డ్రెయిన్ నిర్మించండి సారూ..

**నరసాపురం:** పట్టణంలోని పాత రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమై మురుగుపారక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను మళ్లీ కొత్తగా నిర్మించాల్సి ఉంది. అయితే మునిసిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్ల వాడకపు నీరు ఈ డ్రెయిన్ నుంచే బయటకు వెళ్లాలి. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్‌స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలమవడంతో మురుగు సవ్యంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## చెట్ల వేలం ద్వారా రూ.13 లక్షల ఆదాయం

**మొగల్తూరు:** కేపీ పాలెంలోని రాజగోపాలస్వామి ఆలయానికి చెందిన సరుగుడు, నేరేడు చెట్లను విక్రయించేందుకు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. సుమారు 7.90 ఎకరాల్లో ఉన్న సరుగుడు చెట్లకు వేలం నిర్వహించగా రూ.9.93 లక్షలు, 16 నేరేడు చెట్లకు వేలం నిర్వహించగా రూ.3.05 లక్షలకు పాడి పాటదారులు దక్కించుకున్నారని ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వర్ధినేడి వెంకటేశ్వరరావు, బండి ముత్యాలమ్మ ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ దొంగ శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తొలి దశలోనే గుర్తిస్తే కుష్టు నయం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆశా వర్కర్లు, డాక్టర్ చంద్రశేఖర్, రామ్‌ప్రసాద్

**పాలకొల్లు సెంట్రల్:** తొలి దశలోనే మచ్చలను గుర్తించడం ద్వారా కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని డాక్టర్ మీసాల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం బంగారు వారి చెరువుగట్టు అర్బన్ హెల్త్ సెంటర్‌లో కుష్టు రోగ నివారణపై ఆశ వర్కర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేది వరకు కుష్టు నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసి ఎటువంటి మచ్చలు ఉన్నా వారిని ఆసుపత్రికి పంపించాలన్నారు. రోగ నిర్ధారణ అయితే ఎండీటీ మందుల ద్వారా వ్యాధిని తగ్గించవచ్చని అన్నారు. పారామెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రామ్‌ప్రసాద్ కుష్టు లక్షణాలను వివరించారు. ఇటీవల కొత్త కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి


పెనుగొండలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగేశ్వరరావు


మొగల్తూరులో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మనోహరాచారి

**పెనుగొండ:** వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల్లో తలకు గాయం కాకుండా హెల్మెట్ కాపాడుతుందన్నారు. తద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించుకోవచ్చునన్నారు. హెల్మెట్ లేకపోవడం వలనే ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని సర్వేల్లో వెల్లడైందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ పోలీసులు పాల్గొన్నారు.

### హెల్మెట్ ధరించడం తప్పనిసరి

**మొగల్తూరు:** వాహనచోదకులు హెల్మెట్ లేకుండా చేసే ప్రయాణంతో ఇబ్బందులు తప్పవని నరసాపురం డీఎస్పీ మనోహరాచారి హెచ్చరించారు. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో సోమవారం రాత్రి వాహనదారులు, వర్తకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బైక్ కొనుగోలు సమయంలోనే విధిగా హెల్మెట్ కొని వినియోగించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చని ఆయన వివరించారు. ఎస్సై ఎం.వీరబాబు, పోలీస్ సిబ్బంది, స్థానిక వర్తకులు, వాహనదారులు పాల్గొన్నారు.

## రేపు కంటి వైద్య శిబిరం

**మొగల్తూరు:** స్థానిక అందేబాపన్న జూనియర్ కళాశాలలో నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ సోమవారం చెప్పారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డులను వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

## కుట్టు మెషీన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**నరసాపురం రూరల్:** పేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, అనాథలు వంటి వారికి సాయం చేయడంతో సంతృప్తి కలుగుతుందని సర్పంచ్ దొండపాటి వెంకటేశ్వరరావు (వెంకట్) అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామంలో రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలు 20 మందికి కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో గ్రామ సర్పంచ్ వెంకట్ మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామ పెద్దలు నల్లి జయవరప్రసాద్ (జేవీఆర్), మాజీ సర్పంచ్ నేత సూర్యారావులు తదితరులు ట్రస్ట్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో రాజ్ ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్‌కుమార్, సీమోను, నల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


మావుళ్లమ్మపేటలో అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు

**పాలకొల్లు అర్బన్:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించాలని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు అధికారులను కోరారు. పట్టణంలోని మావుళ్లమ్మపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మూడు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ కుటుంబాలకు మూడు బస్తాల బియ్యం, బియ్యం డబ్బాలు, చీరలు, దుప్పట్లు సోమవారం అందజేశారు. బాధితులకు టిడ్కో గృహాలు మంజూరు చేయాలని మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ధనాల దుర్గమ్మ, యడ్ల సత్యనారాయణ, దొమ్మేటి వెంకట్రావు, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గవర బుజ్జి, జోగాడ ఉమామహేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, కాసాని కేశవరావు, పెచ్చెట్టి కోటేశ్వరరావు, గంటా వెంకన్న, కేతా వెంకన్న, పుల్లూరి నరేష్, జోగి వడ్డికాసులు, కందుల మార్కేండేయులు, షేక్ వల్లి, బందెల నరేష్, రాపాక శివకుమార్, రేలంగి శ్రీను, దేవరపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు


2వ వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

**నరసాపురం:** పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ హెచ్చరించారు. సోమవారం ఆమె పట్టణంలోని 2వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రెయిన్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటాన్ని గమనించిన చైర్‌పర్సన్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమలు పెరగకుండా ఫాగింగ్ చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి స్వర్ణాంధ్రలో ఫెస్ట్


ముగ్గుల పోటీలను తిలకిస్తున్న కళాశాల యాజమాన్యం

**నరసాపురం రూరల్:** నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళ, బుధవారాల్లో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్2కె23 పేరుతో ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభం, ముగింపు కార్యక్రమాలకు కళాశాల యాజమాన్యం, చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తదితరులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ సదస్సును పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు ఆటలు, విద్యార్థినులకు రంగవల్లికలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని ప్రిన్సిపాల్ ఎస్.సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

## భట్లమగుటూరు మాజీ సర్పంచ్ మృతి


బయ్యే కిష్టాఫర్ (ఫైల్)

**పెనుమంట్ర:** భట్లమగుటూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బయ్యే కిష్టాఫర్ (73) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య బయ్యే సుగుణమ్మ గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కిష్టాఫర్ మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుల పెన్మెత్స విశ్వనాథరాజు, ఈది ప్రవీణ్, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, మార్టేరు సర్పంచ్ మట్టా కుమారి, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఈది అనిత, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కిష్టాఫర్ కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు.

## జేసీఐ పట్టణ అధ్యక్షురాలిగా డాక్టర్ మౌని

**పాలకొల్లు సెంట్రల్:** సేవా కార్యక్రమాలు అందించడంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ముందంజలో ఉంటుందని జేసీఐ జోన్ ప్రెసిడెంట్ జీఎస్ఎన్ వర్మ అన్నారు. సోమవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో జేసీఐ పాలకొల్లు శాఖ సమావేశం నిర్వహించారు. పట్టణ జేసీఐ అధ్యక్షురాలిగా డాక్టర్ కావలి మౌని, సెక్రటరీగా అనుష, ట్రెజరర్‌గా సబితలను ఎంపిక చేశారు. నూతన సభ్యులు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు ద్వారా జేసీఐను మరింత ప్రాచుర్యం పొందేలా చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ముచ్చర్ల సంజయ్, ఏడుకొండలు, డాక్టర్ మురళీమోహన్, రేపాక మీనా మణిదీప్తి, దాసరి శ్రీనివాస్, రేపాక ప్రవీణ్‌భాను పాల్గొన్నారు.

## ఎరువుల నిల్వల తనిఖీ

**పాలకొల్లు అర్బన్:** దాళ్వా సీజన్‌లో యూరియా, ఇతర ఎరువులను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించే ఎరువుల షాపులు, సొసైటీ దుకాణాలపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం హెచ్చరించారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల సొసైటీలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్లను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. తేడాలున్న షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.